క్లుప్తంగా

బోనమెత్తిన ఎర్రబెల్లి



దేవరుప్పుల: కడవెండిలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ ఉత్సవాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్నం బోనం నెత్తిన ఎత్తుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలతో నెత్తిన పట్నం బోనం ఎత్తుకున్న దయాకర్‌రావు పలు వీధుల్లో తిరిగారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం దేవరుప్పుల మండలం కేంద్రానికి చెందిన నడిదె రాజనర్సింహా రెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ఏల సోమసుందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: బమ్మెర గ్రామానికి చెందిన బెల్లం కొండ సోమయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా సోమయ్య కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, బమ్మెర నాయకులు తదితరులు ఉన్నారు.

సన్మానం

జనగామ: జనగామ బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, జిల్లా ఆర్యవైశ్య మహాసభ, జిల్లా లీగల్ సెల్ విభాగానికి చెందిన నేతి శ్రీమాన్ గురువారం గెలుపొందారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

కళాకారుడికి..



బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన రచయిత, గాయకుడు, కళాకారుడు కేమిడి కనకరాజును అదే గ్రామానికి చెందిన పలువురు గురువారం ఘనంగా సన్మానించారు. కనకరాజు కళను తమిళనాడు ప్రభుత్వం గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించినందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కనకరాజు పేదరికాన్ని జయిస్తూ కళలో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఖలీల్‌బేగమ్, గుర్రాల లలిత, పంచాయతీ కార్యదర్శి భానుచందర్ పాల్గొన్నారు.

మిత్రుల చేయూత



పాలకుర్తి: జానకిపురానికి చెందిన గడ్డం యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం యాకయ్యతో 1993–94 బ్యాచ్‌లో పదో తరగతి కలిసి చదువుకున్న బాల్య మిత్రులు బాధిత కుటుంబానికి రూ.10,500 సాయం అందజేశారు. గూడూరు, షాపల్లి, గోపాలపురం, తిర్మలగిరి, ఈరవెన్ను గ్రామాల బాల్య మిత్రులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన ఐలపాక లచ్చమ్మ గురువారం మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పంపిన రూ. 5 వేల సాయం పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రత్నాకర్‌రెడ్డి, అశోక్‌పాల్, రజనీకుమార్, ఇసురం యేసు, రమేష్, రాజు, యాదగిరి, సంపత్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయించొద్దు



దేవరుప్పుల: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం క్రయవిక్రయాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సింగరాజుపల్లి పరిధి యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడేనికి చెందిన గుగులోత్ రాజు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాహనంలో తీసుకెళ్తుండగా తనిఖీ చేసి సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఇకపై రేషన్ బియ్యం విక్రయించే వారిపై దృష్టిసారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

శిక్షణతో మహిళలకు ఉపాధి

వరలక్ష్మి మహిళా శక్తి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ



శిక్షణ పొందిన మహిళలు, యువతులు (ఫైల్)

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరలక్ష్మి మహిళా శక్తి కుట్టు శిక్షణ కేంద్రం మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఈ శిక్షణ కేంద్రం నిర్వహణకు ఆరుగురిని ఎంపిక చేసి హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లో 14 రకాల దుస్తులు కుట్టడంపై శిక్షణ ఇచ్చారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎలిశాల రజిత, జంగం సరళాదేవిలకు బిజినెస్ ప్రతిభా అవార్డులను అందజేశారు. అనంతరం జిల్లాలో ఉన్న 12 మండలాల నుంచి ఆరుగురి చొప్పున 72 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఇటీవల మల్కాపూర్ గ్రామంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అవార్డులు అందుకున్న రజిత, సరళాదేవీలను ఎంపిక చేసి మహిళలు, యువతులకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఆయా మండలాల్లో 30 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

కుట్టు శిక్షణ కేంద్రం సందర్శనలో నిర్వాహకులతో పీడీ వసంత (ఫైల్)



మహిళలు వినియోగించుకోవాలి

ప్రభుత్వానికి 14 రకాల డ్రెస్సులను అందించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ద్వారా మహిళలు, గృహిణులు శిక్షణతో పాటు ఉపాధి పొందవచ్చు. ఈ శిక్షణను మహిళలు, యువతులు వినియోగించుకోవాలి.

– వసంత, డీఆర్డీఏ పీడీ

నీటి ఎద్దడి నివారణకు బోర్ల ఏర్పాటు



బోర్ వేయిస్తున్న అధికారులు

పాలకుర్తి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సంధ్యారాణి తెలిపారు. గురువారం ఎల్లమ్మగడ్డ తండాలో బోరు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి సహకారంతో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో నీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లు వేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంతి, అయ్యంగారిపల్లి జీపీ కార్యదర్శి శేఖర్, చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ డైరక్టర్ బానోత్ రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, బిక్కు భిక్షం, నూనావత్ లచ్చిరాం, భూక్య శ్రీను పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ. 8 లక్షలు



వేలంలో పాల్గొన్న ఈఓ, పాటదారులు

చిల్పూరు: చిల్పూరుగట్టు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో 2025–26 సంవత్సరానికి పలు హక్కులకు హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ ముఖ్య కార్యాలయంలో గురువారం వేలం నిర్వహించగా పాలకుర్తికి చెందిన పుట్ట ఆంజనేయులు రూ. 8 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. గతంలో చిల్పూరు ఆలయంలో ఐదు సార్లు వేలం నిర్వహించగా ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరిసారి ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారి రాంగోపారావు ఆధ్వర్యంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి, గండదీపం వద్ద నూనె సేకరణ, కొబ్బరిముక్కలు పోగు చేసుకునే హక్కులపై షీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించడం జరిగిందన్నారు. కాగా, ఆంజనేయులు రూ. 8 లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ శ్రీధర్ రావు జూనియర్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి

● డీపీఓ స్వరూపారాణి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఓ స్వరూపారాణి

బచ్చన్నపేట: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఖాళీ ప్లాట్లు కలిగి ఉన్న వారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి తమ్మడపల్లి గ్రామంలో ఖాళీ ప్లాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌లో ఖాళీ ప్లాట్లకు హద్దులు నిర్ణయించబడుతాయని, ప్లాట్లు కొనుగోలు, విక్రయాలు చేయాలన్నా ఎల్‌ఆర్‌ఎస్ తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు నర్సింహచారి, కవిత, సౌజన్య, భరత్‌కిషోర్, ప్రశాంత్‌ఆచార్య, దేవీ ప్రసాద్, సతీష్‌రెడ్డి, రేవతి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలెపల్లి సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోతి రేణుకరాములుగౌడ్ అన్నారు. మండలంలోని పాంనూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అన్వర్, ఒగ్గు రాజు, షేక్ లాలు, పోశాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని కార్మెల్ స్కూల్ నుంచి హనుమాన్ టెంపుల్ వెళ్లే రోడ్డులో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న, మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తి, గాదేపాక ఎల్లయ్య, బైరు భార్గవ్, గాదేపాక భాస్కర్, పెనుగొండ రమేష్, కామారపు సునీల్,అకుల నాగరాజు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

తరిగొప్పుల: పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్రమాదవశాత్తు చనిపోలేదని, ఆయనను హత్య చేశారని, ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి నిందితులకు శిక్ష విధించాలని సెంటినరీ బాప్టిస్టు చర్చి పాస్టర్ సామెల్ కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై స్పందిస్తూ చర్చి సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. దామెర థామస్, మైఖేల్, ఎర్రవెల్లి బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ప్రవీణ్‌కుమార్



బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్‌కుమార్ గురువారం తాడేపల్లిగూడెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించాలని కోరారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కరుణాకర్

జనగామ రూరల్: జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్, మినీ టెక్స్ టైల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని మాదిగ మేధావుల ఫోరం జనగామ కో ఆర్డినేటర్ యాసారపు కరుణాకర్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. కుమార్, సమ్మయ్య, అబ్దుల్ గఫార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు



విరాళం అందజేస్తున్న శాలినిరెడ్డి

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సతీమణి శాలినిరెడ్డి, కుమార్తె అనన్య రెడ్డి.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలినిరెడ్డి స్వామివారికి రూ. 52,232 విరాళం అందజేశారు. ఆలయ అర్చకులు స్వావారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

రఘునాథపల్లి: మానవ అక్రమరవాణా, మాదక ద్రవ్యాలు, సైబర్ అధారిత లైంగిక నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కంచనపల్లి హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. గురువారం గ్రామ హైస్కూల్‌లో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ వాడకం ద్వారా సైబర్ నేరాలు పెరిగాయని, వాటి ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. 13 నుంచి 21 సంవత్సరాల బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. వీఓఏలు వసంత, రాజేశ్వరి, జ్యోతి, విజయ, గ్రామ పెద్దలు రంగోజు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమీకృత కార్యాలయాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన



చిల్పూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న తదితరులు

చిల్పూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ సమీకృత కార్యాలయాల భవన నిర్మాణానికి గురువారం అనువైన స్థలాలను ఆర్డీఓ వెంకన్న, డీసీపీ రాజమహేందర్‌నాయక్, తహసీల్దార్ సరస్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉండే విధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట నిర్మించేందుకు అనువైన స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి అనువైన స్థలాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపీఓ మధుసూదన్, డీటీ రామారావు, ఆర్‌ఐ చీకటి వినీత్, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎస్సై నవీన్‌కుమార్, అర్చకులు రవీందర్‌శర్మ తదితరులు ఉన్నారు.

దేవాదుల ప్రాజెక్టులో కడియం పాత్ర జీరో

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల ప్రాజెక్టులో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర గుండు సున్నా అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడారు. కడియంపై ఘాటు విమర్శలు చేశారు. చీటికి మాటికి దేవాదుల సృష్టికర్తగా చెప్పుకునే కడియం శ్రీహరి పాత్ర వాస్తవానికి దేవాదుల ప్రాజెక్టులో ఇసుమంతైనా లేదని ఎద్దేవా చేశారు. దేవాదుల తొలి రెండు దశల పనుల్లో కడియం ఏమాత్రం సహకరించలేదని, ఆ మాటకొస్తే గతంలో దేవాదుల నుంచి నీటిని విడుదల చేస్తుంటే అడ్డుకున్న చరిత్ర ఆయనదని విమర్శించారు. గత 15 సంవత్సరాలుగా దేవాదుల ప్రాజెక్టు కోసం ఎలాంటి కృషి చేయని కడియం ప్రస్తుతం ఆఘమేఘాల మీద హెలికాప్టర్‌లో పంప్‌హౌజ్ వద్దకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు తాటికొండ సురేష్, కనకం గణేష్, మారెపల్లి ప్రసాద్, చింత శ్రీను, గుండె మల్లేష్, బి.మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



జఫర్‌గఢ్: తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎండీ అబ్బాస్



జనగామ రూరల్: ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్/దేవరుప్పుల/రఘునాథపల్లి/లింగాలఘణపురం/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పలు మండలాల్లోని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల ను వందరోజుల్లో అమలు చేస్తామని ప్రకటించి పూర్తి చేయలేకపోయారన్నారు. రైతు రుణమాఫీ సగం మందికి వర్తించిందని, రైతు భరోసా కూడా నత్తనడకగా సాగుతుందని విమర్శించారు. నీరు అందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేశ్, సోమన్న, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

సంతాపం

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ గ్రామ శివారు గువ్వలగూడేనికి చెందిన యాతం భిక్షపతి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, సంఘం డైరక్టర్లు సీహెచ్ సోమనర్సయ్య, సంపత్, సుధాకర్, దర్గయ్య, సీహెచ్ కుమార్, పిట్ట నర్సయ్య, పరుశరాములు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కాగా వీరితో పాటు చేపలా వ్యాపారి బయ్య అశోక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు. సొసైటీ సభ్యులతో పాటు ముదిరాజ్ కులస్తులు తదితరులు ఉన్నారు.

నివాళి



రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ ఇటీవల మృతి చెందాడు. కాగా, గురువారం మృతుడి స్వగ్రామం రఘునాథపల్లిలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ములుగు అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, మేకల నరేందర్, కోళ్ల రవిగౌడ్, మినుముల వెంకట్‌రెడ్డి తదితరులు రవీందర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నియామకం

జఫర్‌గఢ్: షాపల్లి గ్రామానికి చెందిన మాచర్ల రమేశ్‌గౌడ్‌ను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గిలకత్తుల రమేశ్‌గౌడ్, పోలంపల్లి వినయ్‌కుమార్ గౌడ్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటలో తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కుమారస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బురుగు రవిగౌడ్, సహాయ కార్యదర్శిగా దుద్దుల చంద్రమౌళిగౌడ్, కోశాధికారిగా తాళ్లపల్లి సుభాష్‌గౌడ్‌ను నియమించినట్లు వారు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

పాలకుర్తి టౌన్: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని గురువారం చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను ఎస్సైలు దూలం పవన్‌కుమార్, లింగారెడ్డి ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో మాజీ సర్పంచులు జరుపుల బాలునాయక్, నాకిర్త యాకయ్య, కరుణాకర్, ధారవత్ బాలునాయక్ ఉన్నారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: గడువు ముగిసిన తినుబండారాలు విక్రయిస్తూ చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పట్టణ కేంద్రంలో నెహ్రూ పార్క్ రోడ్డున ఉన్న మోర్ సూపర్ మార్కెట్‌పై చర్య తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిద గోపి కోరారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా

కొడకండ్ల: మండలకేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే సంత వేలం పాట ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి మహేశ్ తెలిపారు. గురువారం స్పెషలాఫీసర్ రవీందర్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంత వేలం నిర్వహించగా నలుగురు పాటలో పాల్గొన్నప్పటికి తక్కువ పాట పాడినందున వేలంను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నేడు అంగడి వేలం..

తరిగొప్పుల: మండలకేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే అంగడి(తైబజార్)కి నేడు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల వారు పాల్గొని తైబజార్‌ను దక్కించుకోవాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ బస్‌స్టేజీ సమీపంలో గురువారం గ్రామ యువకుడు ఆకుల సాయికిరణ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ సెక్రటరీ శశికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు సాయికిరణ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేసవి ముగిసే వరకు ప్రతీ రోజు తాగునీరు అందించేందుకు కృషిచేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్, బత్తుల రాజన్‌బాబు, శాగ వెంకటేశ్వర్లు, నాగరాజు, వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు ఏర్పాట్ల పరిశీలన



పాలకుర్తి: మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో ఈనెల 28వ తేదీన ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ రాకేష్, ఎంపీఓ రవీందర్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తదితరులు ఉన్నారు.

వానకొండయ్యగుట్ట పరిరక్షణకు పాటుపడుదాం..



గిరిజనులతో లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: గిరిజనుల ఆరాధ్యుడైన లక్ష్మీనర్సింహస్వామికి నిలయమైన వానకొండయ్యగుట్ట పరిరక్షణకు పాటుపడుదామని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కడవెండి శివారులో కొనసాగుతున్న వానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి జాతరలో మూలవిరాట్‌కు మొక్కులు చెల్లించుకున్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే శాశ్వత ప్రాతిపదికన జిల్లా పరిషత్ నిధులతో తాగునీటి కల్పనకు చర్యలు తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య సజ్జన్, రామచంద్రునాయక్, గుగులోత్ రాజేందర్, భాస్కర్, వీరన్న, యాదన్న, నరసింహ, అబ్దుల్, రవీందర్, సోమన్న, శ్రీను, యాకన్న, నరేందర్, శ్రీకాంత్, వెంకన్న పాల్గొన్నారు.